

విమల ప్రేమిస్తుంది. సేవలుచేస్తుంది. శేఖరంతో చేయి కలిపి ఒంటరితనంవదలిజంటతనం కాంక్షిస్తుంది. శేఖరంఆమెను పెళ్లాడాలని అక్క కాంతంతో ఆమె ఊసు ఎత్తుతాడు. అంత ప్రేమించిన విమల......

శేఖరానికి ఏమి చేయడానికీ తోచటంలేదు.

సినిమాకి వెళ్ళదామంటే మంచి సినిమాలేమీ లేవు. రూములోనే కాలు కాలిన పిల్లిలా పచార్లుచేస్తున్నాడు. ఇంతల్లోకి పోస్టుమాన్ వుత్తరం యిచ్చి వెళ్ళిపోయాడు. శేఖరం అక్క కాంతందగ్గరనుంచి వచ్చింది. వారికి విశాఖపట్టణంలో మంచి యిల్లు దొరికిందిట; వచ్చి నాలుగు రోజులపాటు వుండమని వ్రాసింది.

శేఖరానికి అతని అక్క కాంతం తప్ప కావలసినవాళ్ళెవరు లేరు. శేఖరం అంటే కాంతంకు పంచప్రాణాలు. అప్పుడే మూడేళ్ళనుంచి శేఖరం బెజవాడలో ఉద్యోగం చేస్తున్నాడు; నెలకి రెండువందలు యిస్తారు. కాంతం శేఖరంతో ఎప్పుడు చెప్పినా "పెళ్ళి చేసుకోమని". అప్పుడే ఎందుకు లెద్దూ, సుఖంగా బ్రతకక అని జవాబు చెప్పడం శేఖరం వంతు. శేఖరం మూడు నాలుగు నెలలకొకసారి నాలుగయిదు రోజులు శెలవు పెట్టి అక్కగారింటిదగ్గర వుండివస్తుంటాడు. కాంతం వాళ్ళకి వైజాగ్ ట్రాన్స్ఫరయి మూడు నెలలయింది; శేఖరం యింతవరకు ఒక్కసారి కూడ వెళ్ళలేదు. శేఖరం వెంటనే ఆఫీసుకు నాల్గు రోజులు శెలవు పెట్టి, బావగారికి వైరు యిచ్చి వైజాగ్ బయలుదేరాడు. శేఖరం బావ సుందరం స్టేషనుకు వచ్చి కలుసుకున్నాడు.

శేఖరానికి కాఫీయిస్తూ "ఎంతగా చిక్కిపోయావురా! అయినా గాని ఎన్నాళ్ళీ హోటలు తిండి. శుభ్రంగా ఎవతెనో ఒకామెను చూసి మూడుముళ్ళు వేసి వహాయింటి పట్టునవుంటే హాయిగా వుండేవాడివి" కాంతం ఎంతో యిదైపోయింది.

"సరేలే, చూద్దాం అంత కంగారేమొచ్చింది" తాపీగా అన్నాడు అలవాటు ప్రకారం కాఫీ తాగుతో.

కంగారేమిటంటావేమిట్రా, అప్పుడే నీ యీడువాళ్ళు యిద్దరూ ముగ్గురూ పిల్లల్ని కంటేను" శేఖరం పెళ్ళి చేసుకోలేదనే బాధని వ్యక్తంచేస్తో అంది.

"అప్పుడే మొదలెట్టావ్. యింకా అతను యింట్లో దిగకుండానే, అతన్ని స్నానం చేయనిచ్చి యింత అన్నం పెడుతూ చెప్పదువుగానిలే" సుందరం సంభాషణ తెగగొట్టేశాడు. శేఖరం నవ్వుకుంటూ స్నానానికి లేచాడు. సుందరం పుచ్చుకున్న యిల్లు చిన్నదయినా అన్ని హంగులూ వున్నాయి. క్రిందగదులు కాక మేడమీద రెండుగదులు, వెనక బాల్కనీ, దూరంగా సముద్రం కనబడుతూ వుంది. యీ మేడని ఆనుకొని ప్రక్కనే రెండు మేడలున్నాయి. ఆ మేడకి యీ మేడకి మధ్య రెండు గజాలు దూరం వుంటుంది.

మధ్యాహ్నం ఆఫీసుకు వెళ్ళిన సుందరం గంట తిరక్కుండా యింటికి వచ్చేశాడు. కాంతాన్ని పిలిచి "చూడు కాంతం, మా పిన్ని కూతురు సుమకి పెళ్ళిట. నాల్గు రోజులైనా ముందరగా రమ్మని మా పిన్ని ఉత్తరం వ్రాసింది. యీ వుత్తరం మూడు రోజులు లేటుగా అందింది. మనం యీ వేళే బయలుదేరాలి. లేకపోతే మా పిన్ని, నా జీవితమంతా దెప్పుతుంది. త్వరగా సామాను సర్దేయ్. పిల్లల్ని ముస్తాబుచేసి, గంటలో రెడీ కావాలి." చుక్క తిరక్కుండా చెప్పేశాడు నాలుగు ముక్కల్లో.

"అంటే మరి తమ్ముడెలాగ?" కాంతం సందేహం వెళ్ళబుచ్చింది.

"దానికేంలే, అతను కూడ, యీ నాలుగు రోజులు మనతోనే వుంటాడు" అంటూ సుందరం శేఖరాన్ని పిలిచాడు. శేఖరం ససేమిరా రానన్నాడు.

"అవుతే నేనూ వెళ్ళడం మానివేస్తా" తమ్ముడిని బలవంతం పెట్టే ధోరణిలో అంది కాంతం.

"ఏదో నాలుగ్గోజులు ప్రశాంతంగా గడుపుదామనివస్తే, మళ్ళీ ఆ గందరగోళంలోకి రమ్మంటావేమిటే. మీరు వెళ్ళి వచ్చేయండి, మీరు వచ్చినదాకా నేను ఇక్కడే వుంటాను" శేఖరం అక్కకి నచ్చచెప్పాడు.

"విడిసినట్టే వుంది. నువ్వు రాకపోతే ఎలాగ, కాంతాన్ని పిలలనీ తప్పక తీసుకురమ్మని మరీ మరి వుత్తరం వ్రాస్తే" సుందరం భర్తనన్న అధికార ధోరణిలో అన్నాడు కాంతంతో.

కాంతం యింక ఏమి చెప్పడానికి వీలులేక, శేఖరాన్ని, తను మళ్ళీ తిరిగి వచ్చేవరకు ఆగమని, చెప్పింది మరీ మరీ.

సాయంత్రం జనతాకి, కాంతాన్ని సుందరాన్ని పిల్లలనీ ట్రయిను ఎక్కించి, ఇంకా ప్రొద్దుపోకపోతే బీచికేసి నడిచాడు.

సముద్రం హోరుమని వీస్తోంది. ఆహోరుని ఘోషని లెక్కచేయకుండా యువతీ యువకులు జంటలు జంటలుగా కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు. దూరంగా కూర్చున్న కాలేజీ అమ్మాయిల గుంపు, ఎవరో కొడీ



కుర్రాళ్లు చేసే గోల భరించలేక లేచి వెళ్లిపోయారు. ప్రపంచం అంటే ఏమిటో ఎరగని చంటి కుర్రాడిని సముద్రపొడ్డున నిలబెట్టి, కెరటాల తుంపరలకి నవ్వుతున్న చంటివాణ్ణి చూస్తో ఆనందిస్తున్నారు భార్యాభర్తలు. దూరంగా యిద్దరు ముసలివాళ్లు కూర్చుని తమ సంసారాలని గురించి మాట్లాడుకుంటున్నారు, చుట్టూ వున్న ప్రకృతిని మరచిపోయి. శేఖరం తను ఒక్కడే అప్పుడు, ఆమాటకొస్తే ఎప్పుడూ ఒంటరితనం అనుభవిస్తున్నట్టు ఫీలయ్యాడు. ఇక అక్కడ కూర్చోలేక పోయాడు. చీకటికూడ పడింది. లేచి యింటిముఖం పట్టాడు. దారిలో పాడుపడ్డ సత్రంలో బిచ్చగాళ్లు కాపురాలు పెట్టారు. అందులో ఒహబిచ్చగాడు, చంటికుర్రవాడిని గుండెల మీద పడుకోబెట్టుకొని, ప్రక్కనేవున్న ఆడమనిషితో, భార్య అయివుండవచ్చు, కబుర్లు ఉషారుగా చెప్పుకుపోతున్నాడు. వాడి మొహంలో, వాడొక ముష్టివాడు, డబ్బులేదన్న బాధ లేకుండా, ఆనందంగావుంది. శేఖరానికి వాడిని చూస్తే, "పుష్కలంగా డబ్బులేందే పెళ్లి చేసుకోవడం, నడిసముద్రంలో నావ యీదటం" అన్న తన సిద్ధాంతాన్ని వెక్కిరిస్తున్నట్లుగా ఫీలయ్యాడు.

కడుపులో బాగ ఆకలేస్తోంది. తిన్నగా హోటల్‌కు నడిచాడు. అయ్యరు విస్తరివేసి వడ్డించాడు. "వెంకాయ్ పచ్చడేమిటి" అని అడుగుతున్నా వినిపించుకోకుండా. తిని, అదేక్కాగ్గో, పోల్చుకోండి చూద్దాం. వందరూపాయలు ప్రెజెంట్ అని యీహోటల్లో బోర్డుకూడావుంది చూడలేదా?" ప్రక్కనే భోం చేస్తున్న ఖుర్రాడొంటు అన్నాడు, విసుగ్గెత్తుతున్నట్టు మొహం పెట్టి.

"యీవూళ్లో అన్నిహోటల్లున్నా, యిదినయం సార్" అయ్యరుహోటలు గొప్పదనాన్ని నిలబెట్టడానికి ప్రయత్నించబోయాడు. శేఖరానికి ఏం రుచించలేదు. చెరుగూ అన్నంతిని యివతలకు వచ్చాడు. తనతో ప్రొద్దున్న కొంతం అన్నమాటలు జ్ఞాపకంవచ్చాయి. తనకీ కష్టంగానే వుంది. హోటలు మీల్సు తినడం. పెళ్లి చేసుకుంటే మంచిదే, వయస్సుకూడ ముదురుతోంది. కాని తనకి రెండువందలు మాత్రమే జీతం. తనజీతం సంగతి జ్ఞాపకంరాగానే, శేఖరానికి పెండ్లి ఆలోచన దారంతెగిన గాలిపటంలా ఎగిరి చక్కాపోయింది. శేఖరానికి తన జీవితాన్ని సినిమాల్లో చూపించే పిల్ల జమిందారులా నడపాలని వుంటుంది. తను తెచ్చే రెండువందల రూపాయలు తనకక్కడికే సరిపోవటంలేదు. శేఖరానికి నూరు నూట యాభైతో గంపెడు సంసారాన్ని నెట్టుకువచ్చేవాళ్లని చూస్తే మహాచెడ్డభయం. దానికి శేఖరం మనసులోవుండే జవాబువక్కటే, పట్టకుండా వుండాలి. ఆఫీసుకు తిండికూడ తినకుండా పోతుంటే, మాసిన చిరుగు చీరకి, పొయ్యి మసిచేతులు రాసుకుంటో, గుంటలు పడిన కళ్ళతో, దైన్యంగా పిల్లవాడి పాలడబ్బా జ్ఞాపకంచేసే జీవితం, శేఖరం కళ్ళముందు ఒక్కసారి నిలబడింది. శేఖరం భయంతో ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు. చేతిలో చురుక్కుమన్న సిగరెట్టు శేఖరాన్ని ఆ ఆలోచనలోంచి తేరదీసింది. శేఖరం కంగారులో దారిలోవున్న

మని నీరసంగా మెరిగి పారిపోయింది. ప్రక్కనే వెళుతున్న కాలేజీ అమ్మాయిలు యిది చూసి ఫకాలుమని నవ్వారు. శేఖరం అదేమీ గమనించలేదు.

శేఖరం యింటికివచ్చి బట్టలు మార్చుకొని మేడపైకివచ్చాడు. టైము యింకా తొమ్మిది కాలేదు. ప్రక్కమీద పడుకొన్నాడు. నిద్దర రావటంలేదు. చదవడానికి పుస్తకాలు ఏమీ కనిపించలేదు. లేచి సిగరెట్టు వెలిగించాడు. కిటికీలోంచి సముద్ర కెరటాలు చంద్రుని మసక వెన్నెట్లో కనబడి మాయమవుతున్నాయి. తలుపులు తెరుచుకొని డాబా పైకి వచ్చాడు. విదియ చంద్రుడైనా, మబ్బులు క్రమేపీ చంద్రుడ్ని కనబడనీయటం లేదు. చంద్రుడు మబ్బుల్ని దాటుకు పోవాలని ఎంత ప్రయత్నించుతున్నా, క్రొత్త మబ్బులు వచ్చి మ్రింగివేస్తున్నాయి. శేఖరం మనస్సుకూడ అచ్చు అలాగేవుంది. పిట్ట గోడమీద ఆ మసక వెన్నెల చీకట్లో కూర్చుని, సిగరెట్టు గట్టిగా పీల్చాడు. మబ్బుల్ని దాటి చంద్రుడు బయట పడ్డాడు, ఆ విజయగర్వంతో ఒక్కసారి వెన్నెలను విరబోస్తూ.

శేఖరం కూర్చున్నవాడు గబుక్కుమని లేచాడు, ప్రక్క డాబామీద కూర్చున్న అమ్మాయినిచూసి. ఆ అమ్మాయి శేఖరాన్ని చూచి అదిరిపడి లేచింది లోపలికి వెళ్ళిపోవడానికి. "మీరు వుండండి, నేను లోపలకు వెళ్ళిపోతా" శేఖరం అప్రయత్నంగా అనేశాడు. ఎప్పుడూ ఆడవారితో మాట్లాడి ఎరుగని శేఖరానికి, తను అలా చెప్పినందుకు తనకే ఆశ్చర్యం వేసింది. మళ్ళీ ఆ అమ్మాయి కేసి చూడలేకపోయాడు. "అక్కరలేదు. మీరుండండి నే వెళ్ళిపోతా" అనుకొని ఆ అమ్మాయి జవాబుకు శేఖరం బిత్తరపోయాడు. గుమ్మందాకా వెళ్ళిన శేఖరం ఈమాటు ధైర్యంగానే చెప్పాడు, "మీరుండండి, నేనే లోనికిపోతా." వెళ్ళిపోతూవున్న ఆ అమ్మాయి వెనక్కివచ్చి "పోనీ మీరూ వుండండి" అంది. శేఖరం ఆ మాటకే ఎదురు చూస్తూ వున్నట్లుగా వెనక్కు వచ్చి పిట్ట గోడపయిన కూర్చున్నాడు. శేఖరం యింతవరకు ఆ అమ్మాయిని చూడలేదు. క్రొద్దిగా ధైర్యంచేసి మెల్లగా తలెత్తి చూశాడు. తెల్లగా సన్నంగావుంది. కోల మొహం. తెల్లచీర, తెల్ల జాకట్టు వేసుకొని వదులుగా జడవేసుకొంది. గాలికి ముంగురులు ఎగిరి మొహాన్ని కప్పివేస్తున్నాయి. శేఖరానికి వెన్నెట్లో ఆ అమ్మాయి మెరుస్తున్న కెరటంలా కనపడింది. శేఖరం ఆ అమ్మాయిని అంతకంటే వర్ణించుకోలేదు.

"కాంతంగారు మీకు" ఆ అమ్మాయే మొదట మాట్లాడటం ప్రారంభించింది.

"అక్క" శేఖరం జవాబు చెప్పాడు.

"మీ పేరు" శేఖరం తనపేరు చెప్పి, ఆమెను అడిగాడు.

"విమల" శేఖరానికి ఎందుకోగాని, ఆ పేరు ఆమెకు తగినట్టు కనిపించలేదు.

"కాంతంగారు వూరిలో లేరా?"

"వూరికి వెళ్ళింది నాల్గురోజుల వరకు రాదు."

శేఖరం జావాబు చెప్పాడుగాని సంభాషణ పొడిగించలేక పోయాడు. ఇద్దరూ మౌనంగాకూర్చున్నారు. పావుగంటగడిచింది. విమల మెల్లగాలేచి "నేవస్తానండి, రేపు మళ్ళీ కలుసుకోవచ్చుగా యివాల్టికి గుడ్ నైట్" సన్నగా నవ్వి వెళ్ళిపోయింది యింట్లోకి. శేఖరం ఆమెను యింకా ఆగమని అడుగుదామని అనుకొన్నాడుగాని, సాహసించలేకపోయాడు. శేఖరం అలాగే సముద్రం కేసిచూస్తూ రెండు సిగరెట్లు బూడిదచేశాడు. సముద్రంపై ఆ వెన్నెల మెరుపులని చూస్తే, శేఖరానికి ఏదో వెలితిగా తోచింది. లోపలకివచ్చి పరుపుపై పడుకున్నాడు. రాత్రి గడియారం మూడు గంటలు కొట్టిన తర్వాతగాని శేఖరం కళ్ళు మూతలు పడలేదు.

ఉపాధ్యాయుడు పిల్లలందరినీ బడికి వచ్చేటప్పుడు తలదువ్వుకొని రమ్మననిచెప్పి మరునటి రోజున తలదువ్వుకొని రాని వాళ్ళందరినీ బయట నిలబడమన్నాడు. అప్పుడు ఒకవిద్యార్థి మాత్రమే బయటికివెళ్ళి నిలబడ్డాడు.

ఉపా: నీవు తలదువ్వుకున్నావుకదా? బయట ఎందుకు నిలబడ్డావు?

విద్యార్థి: నేను తలదువ్వుకోలేదండి. మా అమ్మగారిచేత దువ్వించుకొని వచ్చానండీ!

నిడుమోలు వెంకటేశ్వరప్రసాద్
(గోపన్నపాలెం)

ఉదయం ఎనిమిది గంటలయింది. శేఖరానికి మెలుకువ వచ్చింది. కళ్ళు బాగా మండుతున్నాయి. వళ్ళు వేడిగావున్నట్లు ఫీలయ్యాడు. లేచికాఫీ కాచుకొని త్రాగి, స్నానం వగైరాలు ముగించుకొన్నాడు. పనిచేసే మనిషివచ్చి, యిల్లుతుడిచి, నీళ్లుపెట్టి శేఖరం యిచ్చిన డబ్బులు తీసుకొని కేరియర్ తెచ్చి యిచ్చి వెళ్ళిపోయింది. శేఖరం స్నానంచేసి పడుకున్నవాడు, తిరిగి మధ్యాహ్నం వంటిగంటకుగాని లేవలేదు. వళ్లు బాగా వేడిగావుంది. తలనొప్పి చాల ఎక్కువగా వుంది. అన్నంతినబుద్ధి వేయలేదు. లేచి కాఫీ కలుపుకొని వకకప్పుత్రాగి తక్కినది ఫ్లాస్కులో పోసుకొని మేడపైకి వచ్చి పడుకొన్నాడు. అంత బాధలోను మళ్ళీ నిద్రపట్టింది. అలా ఎంతసేపు పడుకున్నదీ అతనికి తెలియదు. అతనికి నుదిటిమీద చల్లని చేతి స్పర్శకు మెలుకువ వచ్చింది. కళ్లు తెరచాడు. తనకళ్లని తానే నమ్మలేకపోయాడు. "విమల" నోటివెంట అప్రయత్నంగానే అన్నాడు.

"ఊ" నవ్వింది. అంత బాధలోను విమల నవ్వుతున్నప్పుడు ఆమె బుగ్గలమీద పడ్డ సొట్టల్లోని అందాన్ని చూడకుండా వుండలేకపోయాడు.

"ఎలావుంది" రెండు జడల్లోను ఒకజడ తన మొహంమీదపడేటట్టుగా అతనిమీదవాలి ప్రశ్నించింది. ఎర్రటి జార్జెట్ చీర, ఎర్రటి జాకెట్టు, రెండుజడలు, వకజడలో ఎర్ర గులాబీ, చేతికివాచీ; వీటన్నిటి రంగును మించిన ఎర్రటిపెదాలు చూస్తున్న శేఖరం విమల అడిగినప్రశ్నకు జవాబు చెప్పలేదు. "మిమ్మల్నే, వంట్లో ఎలావుంది" మళ్ళీ అడిగింది కళ్ళల్లోకి చూస్తూ. "ప్రస్తుతం బాగానేవుంది" నవ్వుతూ జవాబుయిచ్చాడు. శేఖరానికి ఏమి మాట్లాడడానికి తోచింది గాదు.

"మీ రెలా వచ్చారు" శేఖరం సంభాషణ ప్రారంభించాడు.

"గదిలోంచి గట్టిగా మూలుగు వినబడుతోంది. ఇంట్లో మీరు తప్ప మరెవ్వరూ లేరని నిన్న మీరే చెప్పారు. మూల్గుతుంది ఎవరో చూదామనివచ్చా. మీరు జ్వరంతో వున్నారు". శేఖరానికి జవాబు చెప్పింది. శేఖరం యింకేమీ మాట్లాడలేక పోయాడు. వంట్లో ప్రొద్దుటంతగాలేదు. లేచి కూర్చున్నాడు ప్రక్కమీద. "చూడండి, కాస్త ఆ ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోసి యిస్తారా?" శేఖరం విమలని అడిగాడు. "చూడండీ, బాగా ఆకలేస్తోందా, యీ పూటకూడ లంఖణంచేస్తే మంచిది, జ్వరం తగ్గినప్పటికిన్నీ. కావలిస్తే బ్రెడ్ పట్టుకువస్తా" కాఫీ అందిస్తో అంది.

"డాక్టరులా చెప్పుతున్నారు. ఎలా

"కొదంటాను, మీ యిష్టం" శేఖరం ఆమె మాటకు ఎదురుచెప్పడానికి యిష్టపడలేదు.

"ఎం. బి. ఫైనలియరు చదువుతున్నప్పుడు ఆ మాత్రం చెప్పలేనా? అది సరేగాని, మీరు యికముందునుంచి, నన్ను అండీ అని పిలవడానికి వీలులేదు."

శేఖరానికి ఎక్కడలేని ఆశ్చర్యం ఒక్క క్షణంలో కలిగింది; విమల యం. బి. ఫైనలియరు చదువుతున్నందుకు, రెండవది ఆమెను 'మీరని' పిలవవద్దన్నందుకున్నూ. శేఖరం ఏదో జవాబు చెప్పడానికి ఆమె వైపు తిరిగాడు. విమల అక్కడలేదు. శేఖరానికి యిదంతా ఒక సినిమాకథలా తోచింది. తన్ని తానే నమ్మలేకపోయాడు. నిజమో, కలో అనుమానంవచ్చి తన్ను తాను గిల్లి చూసుకున్నాడు. చురుక్కుమంది. ఈ కల అనుకున్నదంతా నిజమయిన సంతోషంలో ఆ బాధ కనుపించలేదు.

అరగంటలో విమల బ్రెష్ కాఫీ పట్టుకొని వచ్చింది. క్రిందకు వెళ్ళి మంచి నీళ్లు పట్టుకొనివచ్చి, టేబిలు మంచానికి ఎదురుగా లాగి, అంగుపయిన అవి పెట్టి, తను ఎదురుగా కుర్చీ లాగుకుని కూర్చుంది. శేఖరానికి బ్రెడ్డు తిని కాఫీ త్రాగుతుంటే, అతనిలో లేనిహుషారు వచ్చి తను ఇన్నాళ్ళు హోటలుతిండివల్ల పడ్డబాధ అంతా యీఒక్కపూటతో మర్చిపోయాడు. తొమ్మిదిగంట లయ్యేటప్పటికి, శేఖరానికి బలవంతంగానైనా, నిద్రపొమ్మని మరీ మరీ చెప్పి వెళ్లిపోయింది. శేఖరం ఎక్కడలేని ఆనందంలో ములిగిపోయాడు.

మర్నాడుప్రొద్దునే ఏడింటికల్లా విమల కాఫీతోవచ్చి శేఖరాన్ని లేపింది. శేఖరం లేచి మొహం కడుక్కొని కాఫీ తాగాడు. "మీరు ఈపూట హోటలులో భోజనంవద్దు నేను పట్టుకువస్తా" అని చెప్పి వెళ్ళిపోయింది. శేఖరం ఆమెతో అవును, కాదు అని చెప్పే సంగతి కోల్పోయాడు. ఆమె వెళ్ళినవైపే చూస్తూ ఊరుకున్నాడు. అన్నట్టుగానే పది గంటలకల్లా విమల శేఖరానికి పథ్యంగా అన్నం పట్టుకొనివచ్చింది. శేఖరం, విమల కనపరచిన ఆప్యాయత తన అక్క కాంతం దగ్గరకూడ చూడలేదు. ఆ లాలన, బుజ్జగింపు తన్ని ఆమెముందు చంటివాడుగా చేసినయ్. అన్నం తినడం అయింది. "చూడండిసార్ రాత్రికికూడ నేనే అన్నం తీసుకువస్తాను, మీరు యీ నీరసంతో హోటల్లో మాత్రం ఎంగిలిపడకండి. అసలే యివి వైజాగ్ హోటల్సు" విమల కొస్త అధికారం చూపించే ధోరణిలో అంది. శేఖరం ఇంక ఆమెను యిబ్బందిపెట్టడానికి ఇష్టపడలేదు. అయినా గాని, ఆమె పరాయింటి పెళ్ళికానిపిల్ల. ఇవ్వన్నీ ఎవ్వరైనా చూస్తే, తనకంత కాకపోయినా ఆమెకు మాత్రం మంచిదిగాదు. "చూడువిమలా, నాకు జ్వరం అంటూ వచ్చిందిగాని, నీచేతిచలవవల్ల పూర్తిగా పోయింది. ఇంక హోటల్లో తినొచ్చు. ఈపాటిదానికి ఇంకా పథ్యందేనికి" శేఖరం నెమ్మదిగా అన్నాడు. విమలకి కోపం వచ్చింది. శేఖరం నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. కాని విమల వినకుండా వెళ్ళిపోయింది.

శేఖరం నిద్రరాకుండా రేడియో పెట్టుకొని కూర్చున్నాడు. ఏమీ తోచటంలేదు. సాయంత్రం అయింది. బద్ధకంగా లేచాడు. విమల రాత్రికిగాని రాదు. ఈలోపున అలా తిరిగిరావచ్చుగా. లేచి డ్రస్సు వేసుకొని అలా ఊళ్లోకి వెళ్ళాడు. ఎక్కడకీ తిరగ బుద్ధివేసిందిగాదు. హోటల్లో భోజనంఅయిందనిపించుకొని తిన్నగా వచ్చేశాడు. ఏడింటికి ఇంటికి వచ్చినవాడు అలా విమలకోసం ఎదురుచూస్తో కూర్చున్నాడు. రాత్రి తొమ్మిది-పది-పదకొండు, గడియారం గంటలుకొట్టి, విసిగి, గంటలు ఎక్కువ కొట్టడం తగ్గించింది. రెండుగంటలు గడియారం కొట్టడం విని శేఖరం బలవంతంగా కళ్లు మూసుకున్నాడు.

తెల్లవారిలేచి కాలకృత్యాలు తీర్చుకుంటూకూడ, అతనికి ఆమెను గురించే ఆలోచన. మధ్యాహ్నంవరకు చూసినా ఆమె రాలేదు. శేఖరం, ఆమెమనస్సుఅనవసరంగా నొప్పించానని బాధపడ్డాడు. ఆమె చెప్పినట్లుగా, తను హోటల్లో అన్నంమానేస్తే, ఆమెకు యీ కోపం వచ్చివుండేదిగాదు. శేఖరం ఆమెరాకపోతే పిచ్చిఎక్కినట్లు ఫీలయ్యాడు. రాత్రికూడ చూసి, ఆమె రాకపోతే ప్రొద్దున్నే వాళ్లింటికి వెడదామని నిశ్చయించుకున్నాడు. సాయంత్రం ఎక్కడికీ కదలలేదు. ఒకవేళ తను ఎక్కడికేనా వెళ్లితే ఆమెవచ్చి, తను లేడని వెళ్ళిపోతుందని.

శేఖరం డాబామీద కూర్చుని సముద్రంకేసి చూస్తున్నాడు. సముద్రం తన మనస్సులోని బాధనే ఘోషిస్తున్నట్టుగావుంది. శేఖరానికి ఆకలివేస్తోంది. లేచిలోపలకువెళ్లాడు. శేఖరం మొహంలో ఒక్కసారి వెయ్యి జ్యోతులు వెలిగాయి. విమల కుర్చీలో కూర్చుని కాఫీ, టిఫిను సర్దుతోంది, టేబిలు మీద. శేఖరం చూడనట్లు డాబామీదకు పోబోయాడు. ఆమెవచ్చి మెల్లగా చెయ్యి పట్టుకుంది. "కోపంవచ్చిందా? నిన్న మళ్ళీ కనబడలేదని." జాలిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.


"చూడు విమలా, నేను నిన్నే ఆ ప్రశ్న అడగాలనుకుంటున్నా. నిన్న నేను, నీమనస్సుని చాల నొప్పించాననుకుంటా." ఆమె రెండోచేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

"అవన్నీ తర్వాతగాని, ముందు టిఫిన్ తినండి."

శేఖరానికి ఒక్కసారిగా ఆవేశంవచ్చింది. ఆమె రెండుజబ్బలు పట్టుకుని "విమలా, ఒక్కసంగతి. నీవు పెళ్లికానిదానివి. నేను ఎటువంటివాడనో నీకు తెలియదు. నీవు ఇలా ఒంటరిగావస్తే, నేను బలవంతంగా నిన్ను ...నిన్ను" ఏంమాట్లాడుతున్నాడో గ్రహింపులేకుండా, ఆమె కళ్ళల్లోకి ఆవేశంగా చూస్తూ అన్నాడు.

"బలవంతంగా...ఊ—చెప్పండి...? అయినా బలవంతం ఎందుకు. నేను ఒప్పుకున్నప్పుడు" నవ్వుతూ అంది.

ఆమె నవ్వినప్పుడు ఆమెబుగ్గలమీద అవే సొట్టలు, అదేఅందం. శేఖరానికి పిచ్చిఎక్కిస్తాయి. శేఖరాన్ని రెచ్చగొడతాయి. శేఖరం తన్ని తాను సంబాళించుకునే శక్తి కోల్పోయాడు. తను ఏంచేస్తున్నదీ అర్థంచేసుకునే శక్తి పోయింది. ఆమెనడుంచుట్టూ తనచేతిని పోనిచ్చాడు. రెండవచేతిని ఆమె మెడపైవేసి ఒక్కసారి వెనక్కి వంచాడు. అంతే అతని పెదాలు ఆమె పెదాలుతో కలిసిపోయాయి. ఆమె ఒక్కసారిగా కళ్ళుమూసుకుంది. ఆమె వెచ్చని



చిత్రకారుడు: జె. రాముడు (మద్రాసు)




## నారసింహ లేహ్యం

బంగారుతో చేరినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును. 20లు డబ్బీ రు.3-8-0. పోస్టేజి రు.1-1-0

పి. సి. ప. అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం. పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా.

## సినిమానటులు

మీరు సినికారులుగా చేరి, నెలకు మంచి ఆదాయం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తరప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.

BOMBAY FILM SERVICE (A.M.W.)PHAGWARA(N.I.)

## RATNAM'S N-OIL

అంగవరములు బలహీనతి చెంది, చిన్నదినచో తిరిగి యథాప్రకారం అయి పూర్తి సౌఖ్యమనుభవించుటకు 50 సం॥ ప్రఖ్యాతి గలది. 1 సీసా రూ. 10 లు వి. పి. 1-4-0 కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్జెంటుగుణమునకు రూ. 25-0-0 లు.

డాక్టర్. రత్నం సన్స్, (Estd 1904) మలకపేటబిల్డింగ్స్, ఆజంపూరాగా[illegible] వద్ద, హైదరాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)




కృష్ణా లేబరేటరీ బెజవాడ


# విమల

వూపిరి శేఖరం మొహం మీదికి కొడుతోంది. అలా ఎంతసేపున్నదీ యిద్దరికీ తెలిసిందిగాదు.

శేఖరం గబుక్కుమని చేతులు లాగేసుకున్నాడు. తిన్నగా డాబామీదకు వెళ్లిపోయాడు. విమల వెనకాలే వెళ్లింది. శేఖరం ఏదో తప్పుచేసినట్లుగా బాధపడ్డాడు.

"విమలా... నేను చాల పొరపాటు చేశా. నన్ను క్షమించు, నన్ను క్షమించు" సీరియస్ గా మొహం పెట్టి అన్నాడు.

"మరేం ఫర్వాలేదు; వచ్చి టిఫిను తినండి" అదేనవ్వు. బుగ్గలపైన అవేసొట్టలు. శేఖరానికి వాటిని చూస్తుంటే, మనస్సు మనస్సులో వుండదు. ఇంకేమీ మాట్లాడలేక పోయాడు శేఖరం. చంటిపిల్లవాడిలా, ఆమె వెనకాలే లోపలికివచ్చి, కుర్చీ లాగుకొని కూర్చున్నాడు. విమల టిఫిను ప్లేటు ముందుకు త్రోసింది.

"నువ్వు తిన్నావా? నువ్వో రెండూ, నేనో రెండూ" ఇడ్లీవిరిచి కారప్పొడిలో ముంచుతూ అన్నాడు.

"నేను తిన్నా. మీరు తినండి."

శేఖరం ఇడ్లీముక్క నోట్లో వేసుకొని "ఛాఛా, ఏం బాగాలేదు, ఉప్పరొడ్డు" విసుగ్గా మొహం పెట్టి అన్నాడు. విమల తెల్లబోయింది. "కావలిస్తే చూడు" ముక్క విరిచి అందించాడు. "బాగానే వుందే" అని అంది.

"ఉట్టిది కాదు. కారప్పొడితో" అంటూ మళ్ళీ తక్కిన ముక్క యిచ్చాడు. "నిక్షేపంలా వుంది" ఆమె అర్థంగాక సమాధానమిచ్చింది.

"ఒకటి తిన్నావు, యీ ఒకటి గూడ నీ షేరులోదే, కానీయ్" శేఖరం నవ్వుతూ యింకొక ముక్క విరిచి ఆమె నోట్లో కుక్కాడు. ఆమె నవ్వడానికి నోరు తెరిచిందిగాని, నోట్లో యిడ్లీముక్క అడ్డుపడింది.

కాఫీ చెరో గ్లాసులో పోసుకొని త్రాగుతూ "విమలా, ఇందాక చాల అసభ్యంగా ప్రవర్తించాను గదూ?" చిన్నపిల్లవాడిలా అడిగాడు. "ఏమో నేను చూడలేదు; కళ్ళుమూసుకొన్నానుగా" కాఫీ గుటక వేస్తూ అంది.

"విమలా నన్ను పిచ్చివాణ్ణి చేశావ్. మళ్లీ నువ్వు కనక కనబడకపోతే, మీ యింటికే వచ్చేస్తా తెలిసిందా? తర్వాత మీ వాళ్లు ఏమనుకున్నా సరే."

విమల నవ్వింది. "నేను రేపటినుంచి రాను. నేను మా వాళ్లతోకలసి వూరికి వెళుతున్నా. వారం రోజులు పట్టవచ్చు తిరిగి రావడానికి. మీరు కనక యీ లోపున వస్తే యింటికి తాళాలు వుంటాయి."

శేఖరం నిజంగా మతిపోతున్నట్లుగా బాధపడ్డాడు. రెండు నిముషాలు ఏమీ మాట్లాడలేదు. "విమలా యివాళ రాత్రికిగాని, రేపు ప్రొద్దుటికిగాని, కాంతం అక్క రావచ్చు, అక్కతో చెప్పేస్తా. అక్కకూడ మన పెళ్ళికి ఎటువంటి అభ్యంతరం చెప్పదనుకుంటా. ఏమంటావ్. నీకిష్టమేనా చెప్పు... సిగ్గు పడకుండా చెప్పేయ్" శేఖరం విమల చేతిని చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు.

"మీ యిష్టం" విమల బుర్ర వంచుకునే సమాధానం ఇచ్చింది. కాని ఆమె కళ్ల నుంచి రెండు కన్నీటి బొట్లు జారి పడటం శేఖరం చూడలేదు. శేఖరం విమలతో రాత్రి తొమ్మిది వరకు పెళ్ళిని గురించి మాట్లాడుతూనే వున్నాడు. విమల శేఖరం చెప్పింది వినిందిగాని, సమాధానం మాత్రం చెప్పకుండా నిర్లిప్తంగా వుంది. శేఖరం మనస్సు ఆనందంతో తొణికిసలాడుతోంది. విమల వెళ్ళిపోవడానికి లేచింది. శేఖరం గుమ్మం వరకు సాగనంపాడు. ఇద్దరి మధ్య మౌనం తప్ప యింకేమీ లేదు. శేఖరం, తనకి ఆమెకు మధ్య ఏదో అగాధం వున్నట్లుగా ఫీలయ్యాడు. ఆమె వెళ్ళినవైపే అలా చూస్తూ వుండిపోయాడు.

శేఖరానికి వాళ్ళక్కతో విమల విషయం ఎలా కదపాల్సిందీ అర్థం కాలేదు. కాంతం వంటింటిలో కూర తరుగుతోంది. ప్రక్కనే పీట వేసుకొని కూర్చున్నాడు. "అక్కాయ్, అన్నట్టు మన ప్రక్క మేడలో ఎవరే ఉంటూంట". కాంతంకి శేఖరం ఎందుకు ఆ ప్రశ్న అడిగింది తెల్సింది గాదు.

"వినాయకరావు గారని ఒక రిటైర్డు కలెక్టరు మనకి దూరపు బంధువులే" కాంతం కూర తరుగుతో సమాధానమిచ్చింది.

"వాళ్లమ్మాయి విమలట. మా ఫ్రెండు చెల్లెలుకి క్లాసుమేటు. చూసి రమ్మంది" శేఖరం యింతవరకు కాంతంతో అబద్ధం అడి ఎరుగడు.

"విమలా? చూడడానికి ఇంకెక్కడుంది" శేఖరానికి కాంతం జవాబు అర్థంకాలేదు.

"అంటే" ఆత్రుతగా అడిగాడు.

"మొన్న రెండు నెలల్రికితం, ఆ అమ్మాయికి పెళ్లి చేయడానికి సంబంధం కుదిరిస్తే, ఆ అమ్మాయి అతనంటే యిష్టం లేదనుకుంటా, చేసుకోనంది. ఇంట్లో వాళ్లు మూర్ఖంగా పట్టుపట్టారు. ఆమె విషం త్రాగి చచ్చిపోయింది. అప్పటినుంచి వాళ్లు వాళ్ల వూరికి వెళ్లి యింకా తిరిగిరాలేదు." కాంతం కూర తరుగుతూ తాపీగా జవాబిచ్చింది. ★